నిత్యావసర ధరలు తగ్గించాలి : సిపిఎం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: పెంచిన కరెంటు చార్జీలు, నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, మండల కార్యదర్శి ఎస్‌బి పోతురాజు కూటమి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పెంచిన విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలను రద్దు చేయాలన్నారు. స్మార్ట్ మీటర్లు వెంటనే ఉపసంహరించుకుని, ఆదానితో జరిగిన అన్ని రకాల ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పిటిజి గురుకుల స్కూల్‌లో పని చేస్తున్న కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. పెంచిన నిత్యావసర దరలు తగ్గించి, పేద ప్రజలపై భారం మోపకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలను సమీకరించి భారీ ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సర్వే పేరుతో అర్హుల పింఛన్లు తొలగించొద్దు

-స్థాయీ సంఘ సమావేశాల్లో జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : సామాజిక పింఛన్లు అర్హులందరికీ అందేలా చూడాలని, సర్వే పేరుతో అర్హులను తొలగించే చర్యలు చేపట్టవద్దని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధికారులను కోరారు. బుధవారం ఆమె అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశాలు జెడ్‌పి సమావేశ మందిరంలో జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక పింఛన్ల సర్వేపై ఆరా తీశారు. అర్హులందరికీ పింఛన్లు అందజేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పని చేయాలని ఉమ్మడి విశాఖ జిల్లా అధికారులను కోరారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ప్రతి జెడ్‌పిటిసినీ ఆహ్వానించాలని అధికారులను ఆదేశించారు. ఐదో స్థాయీ సంఘ సమావేశంలో సుభద్ర మాట్లాడుతూ పింఛన్ల సర్వేలో ఎవరినైనా తొలగిస్తున్నారా ? అని అడిగిన ప్రశ్నకు సర్వే మాత్రమే జరుగుతోందని, ఎవ్వరినీ తొలగించడం లేదని పీడీ తెలిపారు. అత్యవసర పరిస్థితులలో 108 అందుబాటులో ఉండాలని సుభద్ర ఆదేశించారు. అంగన్‌వాడీ పాఠశాలలకు మరమ్మతులు అవసరమైతే ప్రపోజల్స్ పెట్టిన వెంటనే నిధులు మంజూరు చేస్తామన్నారు. అర్హులైన వికలాంగులకు సదరం సర్టిఫికెట్ అందేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒ కె.రాజ్ కుమార్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు పాల్గొన్నారు.

సమస్యల ఏకరువు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు రాత్రిపూట అందుబాటులో ఉండటం లేదని పలువురు జెడ్‌పిటిసిలు చెప్పగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి సమాధానమిస్తూ అక్కడక్కడా ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు మరుగుదొడ్లు సరిగాలేవని కొందరు జెడ్‌పిటిసిలు ప్రశ్నించగా జిల్లా విద్యాశాఖ అధికారి బదులిస్తూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఆశ్రమ పాఠశాలల నిర్వహణ బాగోలేదని పలువురు సభ్యులు తెలిపారు.

మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర

ప్లకార్డుల ప్రదర్శన

మునగపాక జెడ్‌పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, రాంబిల్లి జెడ్‌పిటిసి ధూళి నాగరాజు, యలమంచిలి జెడ్‌పిటిసి సేనాపతి సంధ్యారాణి, మాకవరపాలెం జెడ్‌పిటిసి రాము సమావేశంలో ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. జిల్లా పరిషత్ అభివృద్ధి నిధులు మంజూరవుతున్నా పనులు జరగటం లేదని, సంబంధిత అధికారులు సహకరించటం లేదని మునగపాక జెడ్‌పిటిసి స్వామి సత్యనారాయణ ఆరోపించారు.

అల్లూరి జిల్లా సమస్యలను పరిష్కరించాలి

-జెడ్‌పి సమావేశానికి డుమ్మాకొట్టిన గిరిజన అధికారులపై చర్యలు తీసుకోవాలి
-సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు డిమాండ్

అల్లూరి జిల్లాలో గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థుల మరణాలను అరికట్టాలని సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు కోరారు. జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాల్లో పాల్గొన్న ఆయన ఈ మేరకు ఛైర్‌పర్సన్‌కు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతగిరి మండలం డముకు నుంచి వాలాసి వరకు రోడ్డు అధ్వానంగా తయారైందన్నారు. రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ రోడ్డును పంచాయతీరాజ్ విభాగం పర్యవేక్షిస్తోందని, ఆర్అండ్‌బికి అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. వాలాసి నుంచి వేంగడ మీదుగా పట్టం వరకు, పట్టం నుంచి ఉప్ప వరకు, అలాగే ఉప్ప జంక్షన్ నుంచి పెద్దకోట, పినకోట పంచాయతీల మీదుగా జీనబాడు వరకు తుప్పలు తొలగించి, రోడ్డు గుంతలు పూడ్చాలని కోరారు. ఏజెన్సీలో సదరం క్యాంపులు నిర్వహించేటప్పుడు ఏ సెంటర్‌లో నిర్వహిస్తున్నారో అందరికీ తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. పిహెచ్‌సి కేంద్రాలకు బర్త్ వెయిటింగ్ కోసం వచ్చిన వారికి, రోగులకు భోజన సదుపాయం కల్పించాలన్నారు. ఆసుపత్రి కమిటీ సమావేశాల్లో జెడ్‌పిటిసి సభ్యులకు ప్రాధాన్యత ఇచ్చి సమావేశాలకు పిలవాలన్నారు. మెయింటినెన్స్ నిధులు దుర్వినియోగం కాకుండా కమిటీ సమావేశాల్లో చర్చించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో ఆశ్రమ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు తగ్గుతున్నాయని ఫిర్యాదు చేశారు. సాయంత్రం సమయంలో స్టడీ అవర్స్ జరగటం లేదన్నారు. హెల్త్ ఎఎన్ఎమ్, హెల్త్ వర్కర్స్ నియామకాలకు తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల మరణాలను అరికట్టాలన్నారు. ఏజెన్సీ మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో మృతదేహాల తరలింపునకు డోలీ మోతలే దిక్కవుతున్నాయని, ఇప్పటికైనా రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అరకొరగా ఉన్న ఫార్మేషన్ రోడ్లను గుత్తేదారులు పూర్తి చేయాలని, అందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారులు జిల్లా పరిషత్ సమావేశాలకు ఎగనామం పెట్టి తప్పించుకుంటున్నారని, సమావేశానికిరాని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు

గతుకుల రోడ్డుపై వెలుతున్న వాహనాలు

అస్తవ్యస్త రహదారితో అవస్థలు

ప్రజాశక్తి -అరకులోయ: పర్యాటకేంద్రమైన అరకులోయ ప్రాంతంలో పలుచోట్ల రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. దీంతో వాహన చోదకులకు నిత్యం ప్రాణ సంకటంగా మారింది. ఈ రోడ్డును మరమ్మత్తు చేయాలని ఎన్ని మార్లు అధికారులకు విన్నవించినా కనీసం స్పందించే నాధుడే కరువయ్యారు. దీంతో నిత్యం ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడక తప్పడం లేదు. ముఖ్యంగా అరకులోయ పర్యటక కేంద్రానికి సమీపంలోని పానిరంగిని వద్ద రోడ్డు పూర్తిగా మరమ్మతుకు గురైంది. పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. నిత్యం రోడ్డుపైనే నీరు పారుతుండటంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పర్యాటక సీజన్ కావడంతో పర్యాటకులు, స్థానికులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణించవలసిన దుస్థితి ఏర్పడింది.

పానిరంగిని గ్రామానికి ఇరువైపులా కూడా ఇదే మాదిరి గోతుల రోడ్లు ఏర్పడి ఉండటంతో అవస్థలు తప్పడం లేదు. సంబంధిత అధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి అరకు -విశాఖ ప్రధాన రహదారిని మరమ్మత్తులు చేసి గోతులు పూడ్చాలని వాహన చోధకులు, స్థానికులు కోరుతున్నారు.

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండలంలోని పలు గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసుబాబు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరిముఖిపుట్టు పంచాయితీలోనీ ధూళిపుట్టు గ్రామంలో కించాయి పుట్టు పంచాయతీ పరిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి, రాగులు, సామలు నూతన వంగడాల సాగు, ఆవశ్యకతను వివరించారు. భూసార పరిరక్షణ విదానాలు వివరించారు. పెరటి తోటల పెంపకంతో కలిగే ప్రయోజనాలు వివరించారు. పశు భీమా, ప్రకృతి వ్యవసాయం, జీవామృతం, బీజామృతం తయారీ ప్రక్రియను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు బాబి కిరణ్, తరుణ్, గ్రామ పశు వైద్య సహాయకులు రాజు, ప్రకృతి వ్యవసాయ సహాయకులు గురు, గాసిరాం పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎఒ

ప్రజా సమస్యలపై సిపిఎం పోరాటం

● ఎటపాక మండల మహాసభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- ఎటపాక : పేద బడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి సిపిఎం మాత్రమే నిరంతరం పోరాడుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం లక్ష్మీపురంలో కాకా అర్జున్, పోడియం రత్తమ్మ అధ్యక్షతన ఎటపాక మండల సిపిఎం 9వ మహాసభ జరిగింది. ముందుగా సిపిఎం సీనియర్ నాయకులు బండారు స్టాలిన్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు సభ్యులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజల కోసం ప్రాణాలు అర్పించిన చరిత్ర సిపిఎమ్‌కు ఉందన్నారు. ప్రలోభాలకు గురి కాకుండా, పార్టీ సభ్యత్వం కంటే ఏది ఎక్కువ కాదని తిరస్కరించిన ప్రజా ప్రతినిధులు సిపిఎం తరపున ఇక్కడ పనిచేశారని గుర్తు చేశారు. ఇతర పార్టీల మాదిరిగా వ్యక్తిగత స్వార్థాలు కాకుండా, ప్రజా ప్రయోజనాలు, సమాజ అభివృద్ధి, సంక్షేమమే పరమావధిగా సిపిఎం కేడర్ పనిచేస్తుందన్నారు. గిరిజనులకు హక్కులు కావాలని పోరాడిందీ సిపిఎంయేనని, అటవీ హక్కుల చట్టాన్ని సాధించిందీ సిపిఎంయేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం కేంద్రంలోని మోడీ సారథ్యంలోని బిజెపి నేతృత్వం ఎన్‌డిఎ ప్రభుత్వ గిరిజనుల హక్కులు హరించి, వారిని అడవుల నుండి గెంటేసే కుట్రలను చేస్తోందని మండిపడ్డారు. మన్యంలో ప్రకృతిసిద్ధమైన విలువైన ఖనిజ సంపదను అదాని, అంబానీ వంటి కార్పొరేటర్లకు కట్టబెట్టడానికి అడవులనుంచి గిరిజనులు తరిమివేస్తున్నారని, కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే హైవేలు వేస్తున్నారన్నారు. గిరిజన గ్రామాల్లో సిసి రోడ్లు వేసేందుకు మీనమేషాలు లెక్కిస్తున్న పాలకులు, హైవేలకు కోట్ల ప్రజాధనం వెచ్చిస్తున్నారని ఎద్దేవా చేశారు. మణిపూర్ తరహాలో దేశవ్యాప్తంగా హింసను ప్రేరేపించడం ద్వారా లబ్ధి పొందాలని బిజెపి ప్రభుత్వం మత ఘర్షణలను ప్రోత్సాహిస్తోందన్నారు. ఎపికి ప్రత్యేక హోదా, పోలవరం నిధులు సాధన హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, ఇపుడు అవన్నీ మర్చిపోయిందన్నారు. కేంద్రంతో కొట్లాడి, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ, నిధులు సాధించే అవకాశం ఉన్నప్పటికీ చంద్రబాబు మాత్రం మోడీ ముందు మోకరిల్లిపోవడం హేయమన్నారు. ఎన్నికల సందర్భంగా సూపర్ సిక్స్ హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం వాటి అమలులో తాత్సారం చేస్తోందన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని మాటిచ్చి, ఇపుడు వాడని విద్యుత్‌కు బిల్లులు భారం వేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల్లో చైతన్యం లేనంతవరకు పాలకవర్గాలు ఇలా హామీలతో మభ్యపెడతారన్నారు. ప్రజలను చైతన్యవంతం చేసి, పాలకులను ప్రశ్నించేలా సన్నద్ధం చేయాలని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, చింతూరు మండల కార్యదర్శి పి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మండల మహాసభలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

సిపిఎం మండల కార్యదర్శిగా అర్జున్‌దొర

సిపిఎం ఎటపాక మండల నూతన కార్యదర్శిగా కాకా అర్జున్‌దొరను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శివర్గ సభ్యులుగా ఐవి, పులుసు బాలకృష్ణ, మండల కమిటీ సభ్యులుగా సోందే రామారావు, జి హరనాథ్, బుద్దుల భద్రయ్య, సవలం రాము, గద్దల హుస్సేన్, పొడియం రత్తమ్మ, కారం జయమ్మ, ఐ.పద్మ, ఇరపా అజయ్, ఇరపా సత్యంలను మండల మహాసభలో ఎన్నుకున్నారు.

ఏజెన్సీ అభివృద్ధికి ఇఎన్‌సి మోకాలడ్డు

● శ్రీనివాస్ నిర్వాకంపై గిరిజన ప్రజాప్రతినిధులు ధ్వజం
● తీరు మారకుంటే విశాఖలోని కార్యాలయ ముట్టడికి హెచ్చరిక

మాట్లాడుతున్న ఎంపిపి కారం లక్ష్మి

ప్రజాశక్తి- విఆర్ పురం: గిరిజన సంక్షేమ శాఖ ఇఎన్‌సి ఎస్.శ్రీనివాస్ ఉన్నంతకాలం గిరిజన ప్రాంతాల అభివృద్ధి జరిగే అవకాశం లేదని మండల ప్రజా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఎంపిపి కారం లక్ష్మి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నా, విశాఖపట్నంలోని గిరిజన సంక్షేమ శాఖ ఇఎన్‌సిశ్రీనివాస్ ఆయా పనులకు సాంకేతిక అనుమతులు మంజూరు చేయడం లేదన్నారు. కాంట్రాక్టర్ల నుంచి ఐదు శాతం ముడుపులను డిమాండ్ చేస్తూ అభివృద్ధికి మోకాలడ్డుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం, సంబంధిత శాఖ మంత్రి, కార్యదర్శులు చొరవచూపి ఏజెన్సీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. లేకుంటే విశాఖలోని ఇఎన్‌సి కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఎంపిటిసి పూనెం.ప్రదీప్‌కుమార్, సర్పంచులు పులి సంతోష్‌కుమార్, పూనెం .సరోజిని, వెట్టి.లక్ష్మి, సవలం మారయ్య, కారం. బుచ్చమ్మ పాల్గొన్నారు.

రంపచోడవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలి

● రేఖపల్లిలో దీక్షలకు సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం సంఘీభావం

ప్రజాశక్తి- రంపచోడవరం : రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక ఆదివాసీ జిల్లాను ఏర్పాటు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం చింతూరు ఐటిడిఎ ఎదుట చేపట్టిన రిలేదీక్షల రెండోరోజు శిబిరాన్ని మడకం దూలయ్య ప్రారంభించారు. రంపచోడవరం డివిజన్‌లోని ఏడు మండలాలు, చింతూరు డివిజన్‌లోని నాలుగు మండలాలతోపాటు విలీలమైన పోలవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలన్నారు. ఏజెన్సీలో ఉద్యోగ, ఉపాధితోపాటు అన్నింటా గిరిజనులకు వందశాతం రిజర్వేషన్లు వర్తించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 46కు అనుబంధం ఉమ్మడి ఎపిలో జారీ చేసిన జిఒ 19, అలాగే సుప్రీంకోర్టు రద్దుచేసిన జిఒ 3 ప్రయోజనాలను పునరుద్ధరించి, గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పూనెం చిన వీరభద్రం, పులి వీరయ్య, సోడీ రాఘవయ్య, సోడి ప్రసాదు, రవ్వ ప్రసాదు, పైద ముత్తయ్య, సున్నం కన్నయ్య, సవలం కోటి,పాల్గొన్నారు.రిలే దీక్షల్లో పి. రమేష్, పి. నరేష్, పి. లక్ష్మణ్, బాయమ్మ, . ప్రియాంక, టి.కోటేష్, టి.కన్నారావు, రవ్వ. ప్రసాద్, సత్యవతి పాల్గొన్నారు.

విఆర్.పురం: రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని దివాసి పరిషత్ నాయకులు సున్నం రాజు డిమాండ్ చేశారు. బుధవారం రేఖపల్లి తహశీల్దార్ కార్యాలయం ఎదుట 48 గంటల రిలే దీక్షల శిబిరాన్ని ప్రారంభించారు, ఏజెన్సీలోని ఉద్యోగాలను శతశాతం స్థానిక గిరిజనులకే ఇవ్వాలని కోరారు. రిలేదీక్షలకు సిపిఎం, ఆదివాసీగిరిజన సంఘం నేతలు, ఆదివాసీ కొండరెడ్ల సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పరిషత్ మండల అధ్యక్షులు పాయం లక్ష్మణరావు, ఆదివాసీ కొండరెడ్ల సంఘం నాయకులు ముర్ల కనకారెడ్డి, నాయకులు పాయం సుబ్బారావు, పోడియం. రాజు, సోడా వెంకటరమణమూర్తి, వేటకాని మల్లయ్య, అందెల.శ్రీరామ్మూరి రెడ్డి, మొట్టం సుమన్, ఐపతిరావు సిలకం శంకర్, సోడి కృష్ణమూర్తి, కారం రాజారావు పాల్గొన్నారు.

దీక్షలకు మద్దతు తెలుపుతున్న ఆదివాసీ గిరిజన సంఘ నేతలు

దీక్షకు ఆదివాసీ గిరిజన సంఘం సంపూర్ణ మద్దతు

రేఖపల్లి తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలేదీక్షలకు ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్ మద్దతు తెలిపారు. షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం చేసిచ ఏజెన్సీ పోస్టులన్నీ స్థానిక ఆదివాసులకే ఇవ్వాలని కోరారు. మెగా డిఎస్‌సి ప్రకటన, జిఒ 3 ప్రయోజనాలను పునరుద్ధరించాలని కోరారు.నాయకులు సోయం చినబాబు, పోడియం శ్రీరామమూర్తి. కారం సుందరయ్య జల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలి

నిరసన వ్యక్తం చేస్తున్న యుటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- చింతూరు : గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులను సిఆర్‌టిలను అక్రమంగా సుదూర ప్రాంతాలకు డిప్యూటేషన్ పేరుతో బదిలీ చేయడం సరికాదని యుటిఎఫ్ ఐటిడిఎ సబ్ కమిటీ కన్వీనర్ ఉర్మా వెంకటనారాయణ అన్నారు. బుధవారం అక్రమ డెప్యుటేషన్లను రద్దుచేయాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక సిపిఎం కార్యాలయం నుండి పోలీస్‌స్టేషన్ మీదుగా ఐటిడిఎ వరకు ర్యాలీ నిర్వహించి, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడుతూ చింతూరు, రంపచోడవరం డివిజన్లలోని ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులను 230 మందిని నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాలకు డెప్యుటేషన్ వేశారని, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాలుగు మండలాల యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం కవిత, పండా కృష్ణయ్య,, జిల్లా కార్యదర్శులు బి ముత్తయ్య, ఎం.సోమరాజు, ఎ.నాగేశ్వరరావు, పి.కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షల పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-పెదబయలు:మండలంలోని కిముడుపల్లి పంచాయతీ గడుగుపల్లి గ్రామంలో విద్యుత్ ప్రమాదంలో మృతిచెందిన బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున ముగ్గురుకి 30 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం నేతలు డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బొండా సన్నిబాబు మాట్లాడుతూ, పీఎం జన్‌మన్ పథకం ద్వారా ఉచితంగా ఇల్లు మంజూరు చేసి నిర్మించి ఇవ్వాలన్నారు. గిరిజన ప్రాంతంలో గిరిజనులు రకరకాలైన ప్రమాదాలకు గురై మరణిస్తున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి మృతి చెందిన బాధితులకు ఒక్కొక్కరికి పది లక్షల చొప్పున 30 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మానపడాల్, బోండా గంగాధరం, కిల్లో సర్బన్న తదితరులు పాల్గొన్నారు

వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - చీడికాడ: మండలంలోని మంచాల గ్రామ పంచాయతీలో పని చేస్తున్న పంచాయతీ గ్రీన్ గార్డ్‌కు 23 నెలల జీతాలు ఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి ఆర్.దేముడు నాయుడు, గ్రామ ఉప సర్పంచ్ కసిరెడ్డి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ సమస్య పై జిల్లా కలెక్టర్లకు గ్రీన్ గార్డ్ మామిడి చెల్లయ్యమ్మ ఫిర్యాదు చేశారన్నారు. గ్రీన్ గార్డ్ మామిడి చెల్లయ్యమ్మ భర్త మరణించడంతో కుమార్తెను చూసుకొని ఈ పని చేసుకుని జీవిస్తూ ఉందన్నారు. గ్రీన్‌గార్డు జీతం అడిగితే తొలగిస్తామని గ్రామ పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్ చెబుతూ తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారన్నారు. అలాగే గ్రామపంచాయతీ కార్మికులు కూడా తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులందరికీ జీతాలు ఇవ్వాలన్నారు.

ఉపాధి కల్పనకు ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి- మాడుగుల:గిరిజనుల ఉపాధి కల్పనకు ప్రభుత్వం అన్ని రకాలుగా కృషి చేస్తుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. బుధవారం మండలంలో జాలంపల్లి పంచాయతీ కామకూటం గ్రామంలో డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ గీతం విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆరోహన్ ట్రైబల్ సొసైటీ గిరిజనులకు శిక్షణ అందించే భవన నిర్మాణ పనులకు శంకుస్థాపనను ఎమ్మెల్యే నిర్వహించారు. గిరిజన ప్రాంతాలైన గొప్పులపాలెం, లోవకొత్తపల్లి, లోవకృష్ణాపురం, కామకూటం గ్రామాలలో మహిళలకు లభ్యమయ్యే అరటి చెట్లు, అరటి బోదెల నుండి నార తీయుట, వాటితో ఉపయోగకరమైన వస్తువులను తయారీపై శిక్షణ ఇవ్వడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని ఎమ్మెల్యే అన్నారు. ఈ అవకాశాన్ని గిరిజన మహిళలందరూ ఉపయోగించుకొని ఉపాధిని కల్పించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో గీతం యూనివర్సిటీ ప్రాజెక్ట్ అసిస్టెంట్ పవన్ కళ్యాణ్, ఆరోహన్ ట్రైబల్ సొసైటీ కోఆర్డినేటర్ అప్పారావు, సురేష్ పట్నాయక్, ఎంపీడీవో కొంకి అప్పారావు, టిడిపి నాయకులు పుప్పాల అప్పలరాజు, అద్దేపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, పుప్పాల రమేష్, రాజ్ కుమార్, జెర్రిపోతుల సూర్యనారాయణ, సుంకరి సింహాచలం నాయుడు, పెంటకోట జగన్నాథరావు, ఎంపిటీసీ గంగ రాజు, పల్లా నాయుడు ఇన్చార్జ్ ఈఓపీఆర్డి పిఎల్. సతీష్ కుమార్, ఏపీఓ జె.మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఆవిష్కరణలకు బహుమతులు

ప్రజాశక్తి-సీతమ్మధార : స్టార్టప్ సంస్థలను ప్రోత్సహించేందుకు ఆ-హబ్ (ఎయు ఇంక్యుబేషన్ సెంటర్), ఇపిడిసిఎల్ సంయుక్తంగా నిర్వహించిన 'హాక్ ఏపీ హ్యాకథాన్' కార్యక్రమంలో సృజనాత్మక ఆవిష్కరణలను అందించిన ఏడు బృందాలకు రూ.6 లక్షల విలువైన బహుమతులను ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి పృథ్వీతేజ్ ఇమ్మడి అందించారు. ఆంధ్రా యూనివర్సిటీ వేదికగా జరిగిన 13వ ఎడిషన్ 'హాక్ ఏపీ హ్యాకథాన్' కార్యక్రమంలో స్టార్టప్ సంస్థలతో పాటు విద్యార్థులు, నిపుణులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో సహా 72 బృందాలు పాల్గొని విద్యుత్ పంపిణీ వ్యవస్థలోని సమస్యలకు పరిష్కారాలను ప్రదర్శించారు. హ్యాకథాన్ ద్వారా వచ్చిన పరిష్కారాలను అమలుచేయడం ద్వారా సంస్థ సుమారు రూ.2 కోట్లు ఆదా చేయగలుగుతుంది. ఈ సందర్భంగా సిఎమ్‌డి మాట్లాడుతూ వీరు అందించిన పరిష్కారాల ద్వారా సంస్థ మెరుగైన ఫలితాలు సాధించేందుకు, ముఖ్యంగా విద్యుత్ ఘాతాలను నిరోధించేందుకు, ఫీడర్ మీటర్ల కమ్యూనికేషన్ వ్యవస్థను మెరుగుపరిచేందుకు, ముందస్తుగా నిర్వహణ వైఫల్యాలను గుర్తించుట, బిల్లింగ్ ప్రక్రియను సులభతరం చేయుట, నిరంతరాయ విద్యుత్ అందించేందుకు దోహదపడతాయని వివరించారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి

ఎస్ఎఫ్ఐ నేతల డిమాండ్

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లా పెదబయలు మండలం గోమంగి మినీ గురుకులంలో కలుషిత ఆహారం తిని విద్యార్థినులు అస్వస్థతకు గురైన వారికి మెరుగైన వైద్యం అందించాలని, ఈ ఘటన పై విచారణ జరిపి యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్ శ్రీను, జీవన్ కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 7న నిర్వహించిన మెగా టీచర్స్ మీటింగ్ కోసం తయారు చేసిన వంటకాలు మరుసటి రోజు పెట్టడం దారుణమన్నారు. ఆ కలుషితమైన ఆహారం తిన్నవారిలో 8 మంది విద్యార్థినులు వాంతులు, విరోచనాల బారిన పడ్డారన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఎవరైతే కలుషితమైన ఆహారాన్ని విద్యార్థినులకు పెట్టారో వారిని కఠినంగా శిక్షించాన్నారు. విద్యాసంస్థల్లో హెల్త్ అసిస్టెంట్లను నియమించాలని డిమాండ్ చేశారు. అస్వస్థతకు గురైన వారికి మెరుగైన వైద్యం అందించి న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. లేకపోతే విద్యార్థులతో ఐటిడిఏ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

14న నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు

ప్రజాశక్తి-పాడేరు : ఈనెల 14వ తేదీన జిల్లాలో నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేసారు. జిల్లాలోని 16 మండలాలలో పాడేరు డివిజన్ పరిధిలోని అనంతగిరి, అరుకువ్యాలీ, డుంబ్రిగుడ, హుకుంపేట, పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, జి.కె. వీధి, కొయ్యూరు, రంపచోడవరం డివిజన్ పరిధిలో రంపచోడవరం, దేవీపట్నం, గంగవరం, రాజవొమ్మంగి, వై.రామవరం, మారేడిమిల్లి, అడ్డతీగల మండలాల్లో ఉన్న 84 నీటి వినియోగదారుల సంఘాలకు అసాధారణ సర్వసభ్య మండలి సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ మేరకు జిల్లా గెజిట్ నోటిఫికేషన్ విడదుల చేసామని పేర్కొన్నారు. నిర్దేంచిన గ్రామాలలో నిర్వహిస్తున్న ఈ సమావేశ వేదిక వద్దకు ఉదయం 8 గంటలకు చేరుకోవాలని తెలియజేసారు. ముందుగా ప్రాదేశిక నియోజక వర్గం సభ్యులను ఎన్నుకుంటారని పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటల నుండి 5 వరకు నీటి సంఘాల అధ్యక్షులను ఉపాధక్షులను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. నీటి సంఘం ఓటు హక్కు కలిగిన భూ యజమానులు సమావేశంలో పాల్గొనాలని కోరారు.

అల్పపీడనంతో రైతుల్లో గుబులు

ప్రజాశక్తి-రావికమతం:బంగాళాఖాతంలో అల్పపీడనంతో ఈనెల 13 వరకు తుఫాను హెచ్చరికల నేపథ్యంలో మండలంలోని కొత్తకోట, మేడివాడ, అర్జాపురం, తదితర గ్రామాల్లోని రైతుల్లో ఆందోళన నెలకొంది. కోసిన వరి పైరును చిన్న చిన్న కుప్పలుగా పెట్టుకునే పనిలో ఉన్నారు.ఆరుగాలం పండిన పంట ఒక్కసారిగా వర్షానికి తడిసి ముద్దయితే సంవత్సరకాలం జీవనోపాధి పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు ,మూడు రోజుల నుంచి కోసిన వరి పంటను రైతులు కప్పలుగా పెట్టుకోవడానికి కంగారు పడుతూ నానా తంటాలు పడుతున్నారు. ఇటీవల తుఫాను పోయిన తర్వాత రైతాంగం ముమ్మరంగా వరి కోతలపై నిమగ్నమయ్యారు. కోసిన పంటలు పొలాల్లో ఉంది. ఒక వారం రోజులు వాతావరణం అనుకూలిస్తే కోతలు, కుప్పలు పూర్తి చేసుకునే వారమని రైతులు చెపుతున్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలని

తుఫాను ప్రభావం కారణంగా రైతులందరూ వరి కోతలు వాయిదా వేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్ రావు తెలిపారు. మండలంలో మేడివాడ గ్రామంలో బుధవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనకాపల్లి జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు పాల్గొని రైతులకు తగు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 13 వరకు తుఫాను ప్రభావం ఉన్నందున రైతులందరూ వరి కోతలు వాయిదా వేసుకోవాలని, అలాగే ఇప్పటికే వరి కోతల కోసిన వారు వెను వెంటనే చిన్న చిన్న కుప్పలుగా పెట్టుకొని జాగ్రత్త పడాలన్నారు. సంవత్సరకాలం జీవనోపాధి వరి పంటను పాడు చేసుకోకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. బయట ఎత్తైన ప్రాంతంలో కుప్పలుగా పెట్టుకోవాలని ఆయన సూచించారు. మినుము పంటకి ఇన్సూరెన్స్ నిమిత్తము రూ.300 చెల్లించాలని తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు పర్సంటేజ్‌ని బట్టి 20 వేల రూపాయలు బీమా వస్తుందని ఆయన తెలిపారు .అనంతరం పలు ఎరువుల షాపులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో రావికమతం మండల వ్యవసాయ అధికారిని రూప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్ చేయాలి

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో రోడ్లకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు కోరారు. బుధవారం విశాఖ జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జంగిల్ క్లియరెన్స్ చేపట్టకపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని, తక్షణమే ఈ పనులు చేపట్టాలన్నారు. అంగన్వాడీ సెంటర్లకు భవనాలు లేని వాటికి భవనాలు కేటాయించాలని కోరారు.

ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:రానున్న సాగునీటి సంఘాల ఎన్నికల్లో విజయం కోసం కూటమి నేతలంతా సమిష్టిగా కృషి చేయాలని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని సారిపల్లిపాలెం హోం మంత్రి స్వగృహం వద్ద బుధవారం కూటమి నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల సమస్యలపై పెద్దపీట వేసే వారికి అవకాశం కల్పించాలని సూచించారు. కూటమి నాయకులంతా ఒకేమాటపై ఉండి విజయానికి కృషి చేయాలన్నారు.ఇప్పటికే గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాలుగు మండలాల అధ్యక్షులు పెద్దిరెడ్డి చిట్టిబాబు, కొప్పిశెట్టి వెంకటేష్, అమలకంటి అబద్ధం, జానకి శ్రీను, జనసేన నాలుగు మండలాల అధ్యక్షులు వై.నానాజీ, వి.సుధాకర్, పి.శివ, యస్ శ్రీనివాసరావు, బిజేపి నాలుగు మండలాల అధ్యక్షులు వి.రమణ ,కె.శ్రీనివాసరావు, జోగినాయుడు, కనకరాజు పాల్గొన్నారు.

చైత్ర దీపిక ప్రతిభ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నేషనల్ రోలర్ స్కేటింగ్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నర్సీపట్నంకు చెందిన చైత్రదీపిక చైత్ర దీపిక వరుస విజయాలతో దూసుకుపోతుంది. నేషనల్ రోలరు స్కేటింగ్ ఛాంపియన్షిప్స్ జాతీయ స్థాయి పోటీల్లో ఇప్పటి వరకు 11 పతకాలను కైవసం చేసుకున్న చైత్ర దీపిక, తాజాగా మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. పొల్లాచి (కోయంబత్తూరు) లో ఈ నెల 5 నుంచి 15 వరకు జరుగుతున్న నేషనల్ రోలరు స్కేటింగ్ ఛాంపియన్షిప్స్ (రోలరు. స్కేటింగ్ ఫెడరేషన్ అఫ్ ఇండియా)లో 14-17 వయసు విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరుపున కపుల్ డాన్స్ స్కేటింగ్ లో దీటైన ప్రదర్శన ఇచ్చి కాంస్య పతకం సాధించింది. నర్సీపట్నంకు చెందిన చైత్రదీపిక, తన తండ్రి పెదిరెడ్ల రామ సతీష్ ఉద్యోగరీత్యా విజయవాడలో ఉండటంతో, అక్కడే సాధన చేస్తుంది. జాతీయస్థాయిలో పతకాలు సాధించినందుకు స్థానిక క్రీడాభిమానులు అభినందనలు తెలిపారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట: టిడిపి సభ్యత్వం కార్యకర్తలకు భరోసాని కల్పిస్తుందని ఆర్.శివరాంపురం ఆ పార్టీ గ్రామ అధ్యక్షులు దేవర తాతాజీ తెలిపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్యకర్తలకు ఎటువంటి ప్రమాదాలకు లోనైనా పార్టీ పరంగా బాధిత కుటుంబాలను ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సభ్యత్వ నమోదును పలువురు చేసుకున్నారు.

పోలీసులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు నర్సీపట్నం సబ్ డివిజన్లో ఉన్న 40 సంవత్సరాలు పైబడి వయసున్న పోలీస్ సిబ్బందికి బుధవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. డిఎస్పీ జిఆర్ఆర్ మోహన్ ఆధ్వర్యంలో బుధవారం సబ్ డివిజన్ పరిధిలో 22 మంది పోలీసు సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పోలీస్ అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ సిఐ జి గోవింద రావు, ఎస్ఐ జె. రమేష్ పాల్గొన్నారు .

నిధుల దుర్వినియోగంపై విచారణ

ప్రజాశక్తి- గొలుగొండ: మండలంలోని పప్పుశెట్టిపాలెం గ్రామ పంచాయతీ శివారు జమ్మాదేవిపేట గ్రామంలో పాలకవర్గం అనుమతి లేకుండా గ్రామస్తులు నిర్మించుకున్న దేవాలయ మండపానికి పంచాయతీ నిధులు కాజేసారని గ్రామస్తులు ఫిర్యాదుపై బుధవారం ఎంపిడిఓ మేరీరోజ్, ఈవోపిఆర్‌డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారుల నుండి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జమ్మదేవిపేట గ్రామంలో కమ్యూనిటీ భవనాన్ని పాలకవర్గ సభ్యులతో కలిసి పరిశీలించి గ్రామస్తులును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాకిరెడ్డి వరహాలు బాబు, మాజీ సర్పంచ్ బెల్లపు కొండలరావు, మాజీ సర్పంచ్ వార్డు సభ్యులు గొట్టేటి రాజు పాల్గొన్నారు

ఇగ్నోలో భారతీయ భాషా ఉత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రంలో భారతీయ భాషా ఉత్సవాన్ని బుధవారం నిర్వహించారు. సీనియర్ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు, ఉపసంచాలకులు డాక్టర్ ఇ.కృష్ణారావు పాల్గొన్నారు.

సిబ్బందికి సూచనలు చేస్తున్న డిఎస్‌పి సాయి ప్రశాంత్

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: పోలీస్‌స్టేషన్‌లో పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని రంపచోడవరం డిఎస్‌పి సాయి ప్రశాంత్ ఆదేశించారు.బుధవారం వార్షిక తనిఖీల్లో భాగంగా రాజవొమ్మంగి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్లో రికార్డులను పరిశీలించారు, పోలీస్ స్టేషన్ పరిసరాలను, భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారవేదికలో వచ్చిన ఫిర్యాదులను జాప్యం చేయకుండా పరిష్కరించాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో నేరాల నియంత్రణతోపాటు శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. కేసుల దర్యాప్తులో నిబద్ధతతో వ్యవహరించాలన్నారు. సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజవొమ్మంగి సిఐ ఎన్ సన్యాసినాయుడు, ఎస్ఐ నరసింహమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహశీల్దార్ వేణుగోపాల్

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - వై.రామవరం : మండలంలోని చవితి దిబ్బల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహశీల్దార్ వేణుగోపాల్ బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, రైతులెవరూ తమ ధాన్యాన్ని వ్యాపారులు, దళారులకు తక్కువ దరకు అమ్ముకోవాల్సిన పనిలేదన్నారు. నిబంధనల మేరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ప్రకటించిన మద్దతుధరను విక్రయించి, రెండురోజుల్లో ఆన్‌లైన్ ఖాతాల్లో డబ్బులు పొందవచ్చన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సాధారణ రకం ధాన్యం క్వింటా రూ.2300,, సన్నరకం ధాన్యం క్వింటా రూ. 2320 ధరకు కొనుగోలు చేస్తారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఉషారాణి, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - సీలేరు: జీకే వీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ చెక్కలమద్ది నీటి సంఘాల ఎన్నికలు ఈనెల 14న నిర్వహించనున్నట్లు తహశీల్దార్ రామకృష్ణ వెల్లడించారు. బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ, నీటి సంఘాలు ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించారు. చెక్కలమద్ది, గుమ్మిరేవులు పోలింగ్ కేంద్రాల్లో షెడ్యూల్‌ను సిబ్బంది అతికించారనాఉ. ఇప్పటికే నీటి సంఘాలు ఎన్నికలకు ఓటర్లు జాబితాను ప్రకటించామన్నారు. ఎన్నికల సిబ్బంది, పోలింగ్ అధికారులకు శిక్షణ తరగతులు కూడా పూర్తయ్యాయన్నారు. 14న ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ ప్రక్రియ ప్రారంభమౌతుందన్నారు. ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సీతారాం, ఎంఆర్ఐ మహదేవ్, ఆర్ఎస్ డిటి సత్యనారాయణ, విఆర్ఒ లింగాలు పాల్గొన్నారు.

జివిఎంసి ఆస్తులు ప్రైవేటుపరంపై భగ్గు

అక్రమాలపై విచారణ జరపాలి
గుర్రాల పార్కు తీవ్ర అభ్యంతకరం
పలు అంశాలపై కార్పొరేటర్ల ప్రశ్నల వర్షం
వాడివేడిగా సాగిన జివిఎంసి సర్వసభ్య సమావేశం
60 అంశాలకు అమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి, ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటుపరం చేయడం తగదని కార్పొరేటర్లు ముక్తకంఠంతో తెగేసి చెప్పారు. బుధవారం జరిగిన జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో పార్టీలతో సంబంధం లేకుండా జివిఎంసి ఆస్తులను కాపాడాలని కోరారు. అక్రమాలు జరిగిన చోట కమిటీలు వేసి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. బుధవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలు అంశాలు అజెండాగా ముందుకు వచ్చాయి. వాటిలో 3, 40, 41, 42 అంశాలను రద్దు పరిచారు. 6, 46 అంశాలను వాయిదా వేశారు. అలాగే 21 అనుబంధ అజెండా అంశాలలో ఒక అంశాన్ని తిరస్కరించారు. మూడు, నాలుగు అంశాలను ఆమోదిస్తూ సంబంధిత గుత్తేదారుడును బ్లాక్ లిస్టులో పెట్టాలని, 21వ అంశంపై కమిటీ ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. ఈ క్రమంలో మొత్తం 67 అంశాలకుగాను 60 అంశాలను ఆమోదించారు.

వీటిలో ప్రధానంగా నీటి సరఫరా కార్మికుల వేతనాలకు సంబంధించి అనధికారికంగా 162 మంది సభ్యులు ఉన్నారని కూటమి సభ్యులు అభ్యంతరం లేవనెత్తగా దీనిపై విచారణ కమిటీ వేయాలని మేయర్ హరివెంకట కుమారి ఆదేశించారు. అదేవిధంగా నగరపాలక సంస్థకు చెందిన క్రీడా ప్రాంగణాల సభ్యత్వ రుసుముపై తీవ్ర చర్చ జరిగింది. అందులో ప్రధానంగా ఎంవిపి కాలనీలోని స్పోర్ట్స్ ఎరీనాను ప్రైవేటు వారికి ఏడు సంవత్సరాలకుగాను కాంట్రాక్టుకు ఇవ్వడంతో పాటు నగరం నడిబొడ్డున ఉన్న స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో ఆధునీకీకరణ పనులలో తీవ్ర అక్రమాలు జరిగాయని సభ్యులు అభ్యంతరం లేవనెత్తారు. ఈ క్రమంలో ఈ అంశాన్ని వాయిదా వేశారు. ఇటీవల కాలంలో జివిఎంసి సభ్యులు వెళ్లిన అధ్యయన యాత్రకు చెందిన ట్రావెల్స్ సంస్థ ఎం/ఎస్ స్రవంతి బాధ్యతారహితంగా వ్యవహరించినందున సంస్థను బ్లాక్ లిస్టులో పెట్టాలని సభ్యులు కోరగా కమిషనర్ సానుకూలంగా స్పందించారు.

గుర్రాల పార్కుపై చర్చ

ముడసర్లోవ పార్కు సమీపంలోని మూడు ఎకరాల ప్రాంతంలో సుమారు 6 కోట్ల రూపాయల విలువతో చేపట్టిన గుర్రాల పార్కు ప్రతిపాదనలను వెంటనే రద్దు చేయాలని, ఇప్పటికే గుత్తేదారునికి చెల్లించిన సుమారు మూడు కోట్ల నిధులను రికవరీ చేయాలని సభ్యులంతా కోరారు. ఒకానొక సమయంలో నిధుల విడుదలపై తనకు సమాచారం లేదని మేయర్ చెప్పడంతో ఆమె రాజీనామా చేయాలని కూటమి సభ్యులు నినాదాలు చేశారు. నీరు, కరెంటు, వీధి లైట్లు వంటి ప్రధాన సమస్యలు ఉండగా, గుర్రాల పార్కు పేరుతో నిధులు వృథా చేయడంపై పలువురు సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. దీంతోపాటు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నగరపాలక సంస్థ సీనియర్ అసిస్టెంట్ డి.వెంకట్రావు స్వచ్ఛంద ఉద్యోగ విరమణపై సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

టిడిఆర్‌లు, మొండి బకాయిలపై రగడ

అనుబంధ అజెండాలోని టిడిఆర్ జారీల అంశంపై తీవ్ర చర్చ నడిచింది. పది సంవత్సరాలుగా జారీ చేసిన టిడిఆర్‌ల వివరాలు, వాటి విధి విధానాలను కార్పొరేషన్ సభ్యులకు అందజేయాలని సభ్యులు కోరారు. గత ఏడాది కాలంలో జివిఎంసి పరిధిలో 1035 టిడిఆర్‌లు ఇచ్చారని, సిబిసిఎన్‌సి భూములకుగాను దినకరన్ త్యాగరాజు పేరు మీద రూ.63 కోట్ల టిడిఆర్‌లు నాలుగు పర్యాయాలు ఇచ్చారని, రావులపాలెం పూసపాటి లక్ష్మీపతి రాజుకు, రూ.209 కోట్లు టిడిఆర్‌లు ఇచ్చారని పలువురు సభ్యులు కౌన్సిల్‌కు తెలిపారు. జివిఎంసి పరిధిలో గవర్నమెంట్‌కు చెందిన ఖాళీ స్థలాల్లో పార్కులు ఉన్న ప్రాంతంలో భవన నిర్మాణాలు చేస్తున్నారని, మద్దిలపాలెం, నరసింహ నగర్, మధురవాడ ప్రాంతాల్లో విలువైన స్థలాలను కబ్జా చేస్తున్నారని తెలిపారు.

సెవెన్ హిల్స్ కార్మికులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎంజిఎం సెవెన్ హిల్స్ హాస్పిటల్ కార్మికులను అక్రమంగా తొలగించే చర్యలను విడనాడి, వారిని యధావిధిగా విధుల్లో కొనసాగించాలని విశాఖ జిల్లా హాస్పిటల్, నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి వై.రాజు డిమాండ్ చేశారు. సెవెన్ హిల్స్ కార్మికులు బుధవారం హాస్పిటల్ నుంచి డాబాగార్డెన్స్ అంబేద్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాల నుంచి పని చేస్తున్న కార్మికులను అక్రమంగా నోటీసులు ఇచ్చి తొలగించడం దారుణమన్నారు. ఈ విషయమై నెల రోజుల నుంచి సెవెన్ హిల్స్ కార్మికులందరూ నిరసన తెలియజేస్తున్నా యాజమాన్యం స్పందించకపోవడం సరికాదన్నారు.

ఇర్లపల్లి పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజాశక్తి -రంపచోడవరం : మండలంలోని ఇర్లపల్లి ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలను బుధవారం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యాబోధన చేస్తున్నదీ, లేనిదీ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు మంచి లక్ష్యంతో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం మధ్యాహ్న భోజన వంటశాలను పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేసు వివరాలు వెల్లడిస్తున్న సిఐ కన్నప్పరాజు

వెయ్యి కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - కూనవరం :మండలంలోని జగ్గవరం క్రాస్ రోడ్డులో బుధవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.50లక్షల విలువ చేసే గంజాయిని పట్టుకున్నట్లు సిఐ కన్నప్పరాజు తెలిపారు. బుధవారం పోలీస్‌స్టేషన్లలో విలేకర్లతో మాట్లాడుతూ, ముందస్తుగా అందిన పక్కా సమాచారం మేరకు ఎస్ఐ లతాశ్రీ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు నిఘాపెట్టి తనిఖీలు చేయగా, డబ్ల్యుబి 57వి 7843 నెంబరుగల లారీలో గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నారు. ఒడిశా నుంచి హరియాణాకు బస్తాల్లో వేసిన గంజాయిని లారీలో తరలిస్తుండగా పట్టుకున్నామని, రూ.50లక్షలు విలువ చేసే వెయ్యి కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. షేక్ సమల్లీన్, షేక్ అక్తర్, సమాల్ దేవ్ ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశామన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- చింతూరు : మండలంలోని పెద్ద సీతనపల్లి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన యువకుడు సోడే కన్నయ్య కుటుంబాన్ని జెకె ట్రస్ట్ ప్రతినిధులు బుధవారం పరామర్శించారు. ట్రస్ట్ తరుపున రూ.ఐదు ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబానికి. జమాల్‌ఖాన్ ట్రస్ట్ట సభ్యులు రియాజ్, గ్రామ పెద్దలు జీవన్ అందజేశారు.

విఆర్ పురం: మండలంలోని చిన్నమట్టపల్లి పంచాయతీ చింతరేగుపల్లిలో మృతి చెందిన సవలం శారద కుటుంబానికి జమాల్‌ఖాన్ ట్రస్ట్ తరపున రూ.ఐదు వేలు ఆర్థికసాయాన్ని ట్రస్ట్ సభ్యులు కోట్ల బాలయ్య బుధవారం నగదు రూపంలో అందించారు. కార్యక్రమంలో సర్ఫరాజ్, ముత్యాల రామారావు, శంకర్, బాగులమరిడి వెంకటరమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ రాజు

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - సీలేరు: జీకే వీధి మండలం ధారకొండ పంచాయతీ దబ్బకోట గ్రామానికి సిసి రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం సర్పంచ్ నడిగట్ల రాజు శంకుస్థాపన చేశారు. గ్రామపంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులతో 100 మీటర్లు సిసి రోడ్డు నిర్మాణం చేపట్టనున్నామని తెలిపారు. కొన్నేళ్లుగా దబ్బకోటకు సరైన రోడ్డు లేకపోవడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, పంచాయతీ నిధులతో సిసిరోడ్డు ఏర్పాటు చేస్తున్నామని, , పనులను నాణ్యతతో చేపట్టి పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి మాడి. రామన్న, వార్డు సభ్యులు పోతురాజు, జగన్నాథం పాల్గొన్నారు.